
కథ

# సంభవామి యుగే యుగే

డాక్టర్. ఎమ్. సుగుణారావు



**చదువుతున్న ఫైలులోకి దృష్టిసారిస్తూనే కిటికీలోంచి బయటకు చూశాడు పార్థసారథి. అంతా హడావుడిగా తిరుగుతున్నారు. 'దేనికోసమో ఈ బ్రతుకుపోరాటం? మనుగడకోసం పెనుగులాట. ఉదరపోషణ కోసం ఎన్నో వేషాలు. కొన్ని మారువేషాలు కొందరివి మాయాజాలాలు. తను ఎక్కడో చదివాడు. అవినీతిపనులకు అంకితమవుతూ అక్రమార్జనే లక్ష్యంగా కలిగినవారు ఒక శాతం ఉండి మిగతా 99శాతం మందిని బాధపెడు తున్నారట. మరి తన టార్గెట్ జగన్నాథం. ఆ ఒక శాతంలోనివాడేనా?' ఆలోచనలో పడ్డాడు.**

ఇంతలో ఫోన్ మోగింది. ఇంటినుంచి ''నేను క్యాంప్‌కెళుతున్నాను. ఒక ఎంక్వయిరీ ఉంది. ఒరిస్సా సరిహద్దు వరకూ ప్రయాణం. బహుశా బాగా రాత్రైపోతుంది. నాకోసం ఎదురుచూడ కుండా భోంచేసి పడుకోండి'' భార్యకు చెప్పి ఫోన్ పెట్టేశాడు.తన బ్రీఫ్‌కేస్‌లో టేప్‌రికార్డరు, కొన్ని ఫైళ్ళు సర్దుకుని ఆఫీసులోంచి బైటకు నడిచాడు. బైట జీప్ సిద్ధంగా ఉంది.

వాహనం ఎక్కి కళ్ళు మూసుకున్నాడు. రాత్రంతా జగన్నాథం ఎంక్వయిరీకి సంబంధించిన ఫైలు తయారుచేయడంతో నిద్రలేదు. కళ్లు మూసు కున్నా జగన్నాథం చరిత్ర కళ్ళముందు సినిమా రీలులా కదులుతోంది.

⌘⌘⌘

రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జగన్నాథం తండ్రి అటెండరుగా పనిచేసేవాడు. ఉద్యోగం చేస్తూ తండ్రి చనిపోవడంతో స్కూల్ ఫైనల్ పాసైన జగ న్నాథానికి తండ్రి వారసత్వంగా రికార్డు క్లర్కు ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత డిగ్రీతో పాటూ డిపార్టుమెంట్ పరీక్షలు పాసయ్యాడు. ఉద్యోగంలో త్వరితగతిన ప్రమోషన్లు వచ్చాయి. ఇరవయ్యేళ్లలో రికార్డ్ క్లర్కు స్థాయి నుంచి గెజిటెడ్ అధికారిగా ప్రమోషన్ పొందాడు.

అయితే ఈమధ్యనే అతడి అవినీతి జీవితం వెలుగులోకి వచ్చింది. అతను ప్రస్తుతం తను వెళు తున్న ఊళ్ళో రుణాలు మంజూరుచేసే విభాగానికి అధికారి. ఆ ఊళ్ళో పేదవారికి మంజూరయిన కోటిరూపాయల రుణాల్లో పదిశాతం లబ్ధిదారుల నుంచి లంచంగా పొంది ఆ రుణాలు శాంక్షన్ చేశా డని తమకు ఫిర్యాదు వచ్చింది.

'ఈ ఎంక్వయిరీ ఎలా ముగుస్తుందో!' ఆలోచి స్తూనే నిద్రలోకి జారుకున్నాడు పార్థసారథి.

⌘⌘⌘

''సార్ వచ్చేశాం!'' డ్రైవర్ కేకతో కళ్ళుతెరిచి 'తను గంటకు పైగా నిద్రపోయాడు' అనుకుంటూ జీపులోంచే చుట్టూ చూశాడు.

ఆ ఊరు ఒరిస్సా రాష్ట్రానికి సరిహద్దులో ఉంది. చుట్టూ కొండలు. రోడ్డుకు ఇరువైపులా వందిమాగధుల్లా నిలుచున్న టేకు చెట్లు. ఆ ఊరు కొండల మధ్య ఎత్తైన ప్రదేశంలో ఉండడంతో వాతావరణం చల్లగా ఉంది.

జీపులోంచి దిగి ఆ ఆఫీసులోకి అడుగుపె ట్టాడు. ''జగన్నాథంగారు సెలవులో ఉన్నారు. అయినా ఊళ్ళోనే ఉన్నారు. మీరొచ్చారని కబురు పెడతాం'' ఆఫీసులో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ చెప్పాడు.

పార్థసారథి సుఖాసీనుడయ్యాడు. ఎంక్వయిరీ ఎలా చెయ్యాలో ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఐదు నిముషాల తర్వాత ఒక వ్యక్తి గబగబా లోపలకు వచ్చాడు. పొట్టిగా, లావుగా ఉన్నాడు. మెడలో బంగారుగొలుసు, వ్రేళ్లకు ఉంగరాలు, ఖరీదైన సఫారీ డ్రెస్సుతో ఒక పెద్ద వ్యాపారవేత్తలా కని పించాడు పార్థసారథికి. వచ్చిన ఆ వ్యక్తి వంక పరి శీలనగా చూశాడు.


అతను వెంటనే నమస్కారం చేసి ''సార్ నా పేరు జగన్నాథం. మా అమ్మాయి పెళ్లి కుదిరింది. ఆ పనుల్లో బిజీగా ఉన్నాను. అందుకే నెలరోజు లుగా సెలవులో ఉన్నాను. నామీద అనవసరంగా ఫిర్యాదు వేశారు. అంతా రాజకీయం సార్. ఎంక్వై రీలో మీకే తెలుస్తుంది'' అన్నాడు.


పార్థసారథి వెంటనే ''మీ ఆఫీసు గదిలో విచా రణ పూర్తిచేస్తాను. మీ సిబ్బంది సహాయం తీసు కుంటాను. మీరు వెళ్లిరండి పెళ్లి పనులంటున్నారు కదా'' అన్నాడు.

జగన్నాథం నమస్కారం చేసి వెళ్లిపోయాడు. పార్థసారథి సీనియర్ అసిస్టెంట్‌ని పిలిచి తన దగ్గ రున్న లిస్ట్ ఇచ్చి ''ఈ పేర్ల ప్రకారం లబ్ధిదారులకు కబురు పెట్టండి'' అన్నాడు.

పావుగంట తర్వాత బిలబిలమంటూ ఆ ఆఫీసు బయట యాభైమందికి పైగా జనం వచ్చి చేరారు. పార్థసారథికి ఆశ్చర్యం వేసింది. అంత తొందరగా వాళ్ళు ఎలా వచ్చారా? అని.

పార్థసారథి ఎంక్వయిరీ ప్రారంభించాడు.



లిస్టు ప్రకారం ముందుగా ఒక ముసలాయన లోపలికొచ్చాడు.

శుభ్రంగా ఉతికిన తెల్లచొక్కా, పంచె. అప్పుడే చుట్ట తాగిన గుర్తుగా అతడి నుంచి గుప్పుమంటూ వాసన. తను తెచ్చిన టేప్‌రికార్డర్ ఆన్‌చేసి కంప్యూటర్ ఆపరేటర్‌తో తన ఎంక్వైరీ సంభాషణలు టైప్ చెయ్యమన్నాడు పార్థసారథి.

"నీ పేరు?"

"అసిరయ్య"

"ఏంచేస్తావ్?"

"గొర్రె పొట్టేళ్ళు పెంచుతాను"

"లోన్ కోసం లంచంగా రెండు గొర్రె పొట్టేళ్ళు, ఐదువేలరూపాయలు ఇచ్చావట జగన్నాథంగారికి" అన్నాడు పార్థసారథి.

"లేదు సార్. నేను ఏమీ ఇవ్వలేదు" అంటూ ఆ ముసలాయన తన చొక్కా జేబులోంచి ఒక కాగితం తీసి పార్థసారథికి అందించాడు.

"తనకు షాక్ ఇచ్చిన అసిరయ్య మాటల గురించి ఆలోచిస్తూనే మరింత ఆశ్చర్యపోయాడు పార్థసారథి. ఆ కాగితంలోని విషయం చదివేసరికి జగన్నాథం ఏమీ తీసుకోలేదనీ, ఆయన చాలా మంచివాడనీ ఆ ఉత్తరంలోని విషయం.

పార్థసారథి ఇంకో లబ్ధిదారుడిని పిలిచాడు.

అతడూ అదే చెప్పి అలాంటి ఉత్తరమే ఇచ్చాడు.

పావుగంటలో విచారణ పూర్తయ్యింది. అందరూ ముక్తకంఠంతో చెప్పిన విషయం, ఉత్తరాల్లోని సారాంశం ఒకటే. జగన్నాథం నిర్దోషి.

ఎంక్వైరీ అలా ముగుస్తుందని ఊహించని పార్థసారథికి అంతా అయోమయం. 'లబ్ధిదారులంతా పేదవాళ్ళు. లంచం ఇచ్చి తమ రుణాలు పొందినట్టుగా చాలా ఫిర్యాదులు వచ్చాయి. మరయితే సాక్ష్యం చెప్పడానికి ఎవరూ ముందుకు రాలేదు? బహుశా అందరినీ తన అధికారంతో జగన్నాథం భయపెట్టాడా?' పార్థసారథిలో ఆలోచనలు.

"సార్ లిస్టు ప్రకారం ఒక అమ్మాయి రాలేదు, ఆవిడ పేరు అంజలి. ఆవిడ వస్తే విచారణ పూర్తయిపోతుంది" అన్నాడు కంప్యూటర్ ఆపరేటర్.

"అయితే ఆ అమ్మాయిని పిలిపించండి" అన్నాడు.

"సార్...ఆ అమ్మాయి రాదండి. భర్తపోయి ఆరునెలలు అయింది. పిల్లలు చిన్నవాళ్ళు, మీరు వెళితేనే బావుంటుంది" అన్నాడు కంప్యూటర్ ఆపరేటర్.

"మరయితే ఆ అమ్మాయి ఇంటికి నన్ను ఎవరైనా తీసుకెళ్లగలరా?" అన్నాడు పార్థసారథి.

"అలాగేసార్. ఈ ఊరి తలయారిని మీతో పంపిస్తాను" అంటూ ఆ వ్యక్తి బయటకు నడిచాడు.

పావుగంట తర్వాత ఆ ఊరి తలయారితో తన జీపులో బయలుదేరాడు. సరిగ్గా రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. రావిచెట్టు పక్కన ఇటుక బట్టీ దాని పక్కనే ఆ ఇల్లు. ఇంటిముందు చిన్నకిళ్ళీ కొట్టు. తలయారి, పార్థసారథి జీపులోంచి దిగేసరికి కిళ్లీ కొట్లో కూర్చున్న ముసలాయన గబగబా బైటికొచ్చి "నమస్కారం సార్!" అన్నాడు.

"మీ కోడలు అంజలిని పిలువ్" అన్నాడు తలయారి.

"దేనికి బాబూ, మా కోడలికి రావలసిన డబ్బు అందిందిగా" అన్నాడు ఆ ముసలాయన.

"ఎంక్వయిరీ కోసం సార్ వచ్చారు. ఏదో మాట్లాడాలంట" అన్నాడు తలయారి.

ఆ ముసలాయన గట్టిగా పిలిచాడు ఒరియాలో. ఆ అమ్మాయిని బయటకు రమ్మని.

"ఆ అమ్మాయికి తెలుగురాదు, ఈ ముసలాయన కొడుకు ఈ అమ్మాయిని ఒరిస్సా నించి తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాడు. అయితే ఊరినిండా అప్పులు చేసి ఆ అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు" తలయారి పార్థసారథితో ఆ వివరాలు చెపుతుండగానే ఆ అమ్మాయి బైటికొచ్చింది.

పొడుగ్గా తెల్లగా ఉంది. వయసు పాతికలోపే. పార్థసారథి క్షణం సేపు ఆలోచించి 'ఈ అమ్మాయితో ఒరియాలో మాట్లాడితేనే పూర్తివివరాలు తెలుస్తాయి. తనకు కొంచెం ఒరియా తెలుసు' అనుకుంటూ ఒరియాలో సంభాషణ ప్రారంభించాడు.

"తుమో నాకొణొ (నీ పేరేంటి?)"

"అంజలి"

"తుమో స్వామి కెంతి మెరిలె (మీ ఆయన ఎలా చనిపోయాడు)"

"బిష్ఖపి కొరిమరిలె (విషం తాగి చనిపోయాడు)"

"అపణ్ కిచి జగన్నాథంకు దెయిచన్ తెకి? (మీరు జగన్నాథానికి ఏమైనా ఇచ్చారా?)"

ఆ ప్రశ్నకు మాత్రం ఆమె సమాధానం చెప్పకుండా తలొంచుకుంది.

మళ్ళీ గట్టిగా అడిగాడు అదే ప్రశ్న.

ఆమె మౌనంగా ఉండిపోయింది.

"ఏమిచ్చావ్ అంటే మాట్లాడవే. నీకు తెలిసిన ఒరియాలోనే అడిగాను కదా" అంటూ కోపంగా చూశాడు పార్థసారథి.

ఆమె కనుకొనలనించి గుండుసూదితో గుచ్చితే వచ్చే రక్తంలా మెల్లగా కన్నీరు.

పార్థసారథికి ఆశ్చర్యం.

"ఆమె ఎందుకు ఏడుస్తున్నట్టు?" అన్నాడు తలయారితో.

"సార్ ఆయమ్మ దగ్గర ఏమున్నాయ్ ఇవ్వడానికి, భూమా, గొడ్డా, పొట్టేళ్లా...తన మానం, ప్రాణం తప్ప" అన్నాడు తలయారి.

తలయారి మాటలు ఆలోచిస్తూ నిలుచున్నాడు పార్థసారథి.

ఇంకా ఆమె ఏడుస్తూనే ఉంది. రెండు నిముషాల తర్వాత "సార్ మీకో విషయం చెప్పాలి" అంటూ పక్కకు పిలిచాడు తలయారి.


పార్థసారథి రెండడుగులు దూరంగా నడిచి ఆ రావిచెట్టు దగ్గరకు చేరాడు. మెల్లగా తలయారి, పార్థసారథి.

చెవిలో చెప్పాడు ఆ విషయం.

"మైగాడ్" అనుకున్నాడు పార్థసారథి.

గాలి స్తంభించినట్టుగా అయింది. ఆకాశం వంక చూశాడు. అది అతడికి దీనంగా వెలవెలబోతున్నట్టుగా కనిపించింది. వాతావరణం చల్లగా ఉన్నా వేడిగాలితో ఉక్కిరిబిక్కిరిగా అయినట్టనిపించింది అతడికి. తలయారి చెప్పిన ఆ విషయం గురించి ఆలోచిస్తుంటే అతడి రెండుచేతులు బిగుసుకున్నాయి. ఆ విషయం అతడు ఊహించనిది.

అప్పులు భరించలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ అప్పుల తీర్చడం కోసం మళ్ళీ అప్పుచెయ్యాలి. అది ప్రభుత్వం వారిస్తే తక్కువ వడ్డీ. ఆ అప్పు శాంక్షన్ చేసే అధికారి జగన్నాథానికి లంచం ఇవ్వాలి. అయితే ఏముంది ఆమె దగ్గర? తలయారి చెప్పినట్టు మానం, ప్రాణం తప్ప.



ఆమె బలహీనతల్ని తెలుసుకుని అతడు లొంగదీసుకున్నాడు. తన 'మానాన్నే' లంచంగా పెట్టింది ఆ అభాగ్యురాలు. ఇద్దరు చిన్న పిల్లలు, రోగిష్టి అత్త ముసలి మావగారు. విధిలేక అతడికి లొంగిపోయింది.

ఆమెకు జరిగిన అమానుషానికి సాక్ష్యం లేదు. ఎవరికీ చెప్పుకోలేని బాధ.

తలయారి చెప్పిన విషయాలు ఆలోచిస్తున్న పార్థసారథిలో నిర్లిప్తత, నిస్సత్తువ జగన్నాథం అవినీతిపనులకు ఏ సాక్ష్యం మిగల్లేదనే బాధ. అంజలికి న్యాయం చేద్దామన్నా ఆ నిరక్షరాస్యురాలు, పేదమహిళ జగన్నాథం మీద ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాదట. ఇదీ తలయారే చెప్పాడు. కారణం నలుగురిలోనూ నవ్వుల పాలవుతాననే భయం. అంతే!

'అయితే తను ఇప్పుడేం చేయాలి?'' పార్థసారథిలో ఆలోచనలు.

ఇంతలో ఒక కారొచ్చి ఆగింది. అందులోంచి జగన్నాథం నవ్వుతూ దిగాడు.

పార్థసారథికి నమస్కారం చేస్తూ ''సార్ చూశారా? న్యాయమే గెలిచింది. నాకు వ్యతిరేకంగా ఎవ్వరూ మీకు రిపోర్టు చెయ్యలేదు'' అన్నాడు తన నవ్వు కొనసాగిస్తూనే.

జగన్నాథం మాటలతో కోపం మరింత ముంచుకొచ్చింది పార్థసారథికి.

అయినా మౌనంగానే ఉండిపోయాడు. అంజలి తలొంచుకుని నేలచూపులు చూస్తోంది.

''ఏంటి? సార్‌కు ఏం చెబుతున్నావ్? చెప్పు నాకు ఏం లంచం ఇచ్చావో చెప్పు'' అన్నాడు వెకిలిగా నవ్వుతూ ఒరియాలో. ఆమె గబగబా అక్కణ్ణించి ఇంట్లోకి వెళ్లిపోయింది.

పార్థసారథి తట్టుకోలేక పోతున్నాడు. అతడికి అసహనంగా ఉంది. ఆవేశంగా ఉంది.

ఎదురుగా తన ఓర్పుకు పరీక్ష పెడుతున్న జగన్నాథం.

తప్పుచేసే తన ముందు తలెత్తుకుని నిలుచున్న జగన్నాథం.

ఒక ఆడకూతురికి అన్యాయం చేసిన జగన్నాథం.

పార్థసారథి ఆలోచనల్లో పడ్డాడు. 'తన కోపాన్ని నియంత్రించుకోవాలి. తను ఎంక్వయిరీ అధికారిగా వచ్చాడు అంతే. తను కోపం వచ్చినప్పుడు ఏం చేస్తాడు. ఔను కళ్ళు మూసుకుని ఒకటి....రెండు... మూడు...అలా లెక్కపెడుతూనే ఉన్నాడు. ఇంతలో ఉరుము ఉరిమినట్టు, ఏదో శబ్దం వినిపించింది. ఎదురుగా అంజలి ఆమె లోపలికి వెళ్ళి ఎప్పుడొచ్చింది? అనుకున్నాడు.

ఆమె కళ్ళు నిప్పుకణికల్లా ఉన్నాయి. ఆమె శరీరం శివమెత్తిన అమ్మవారు ఆవహించినట్టుగా ఊగుతోంది.

ఆమె చేతుల్లో చెప్పులు అవి జగన్నాథం శరీరంమీద నాట్యం చేస్తున్నాయి. ఆమె ఇష్టం వచ్చినట్టు కొడుతోంది. ఊహించని ఈ సంఘటనకు షాక్‌లోంచి తేరుకుని జగన్నాథం అయోమయంగా ఆమెకొట్టే దెబ్బల్ని భరిస్తూ అలాగే నిలుచుండిపోయాడు.

రెప్పపాటుకాలంలో ఆ ఘటన జరిగిపోయింది. పార్థసారథి ఆశ్చర్యం, ఆనందం కలగలిసిన భావం. ఆమెనే చూస్తున్నాడు.

జగన్నాథం వేసుకున్న తెల్లటి సఫారీ డ్రెస్సు నిండా చెప్పుల ఆనవాళ్ళు. బాగా ఉబ్బిన బుగ్గలతో ఉండే జగన్నాథం ముఖం మరింత ఉబ్బిపోయింది చెప్పుల దెబ్బలతో. కొద్దిక్షణాల తర్వాత తనకు జరిగిన పరాభవం గురించిన జ్ఞానం కలగడంతో అక్కణ్ణించి వేగంగా పరిగెత్తి కారులో కూర్చున్నాడు జగన్నాథం. వెంటనే కారు కదిలిపోయింది.

'కుక్కకాటుకు చెప్పు దెబ్బ' మనసులో అనుకోబోయి మాటలు పైకి వచ్చేశాయి పార్థసారథికి.

ఆ సమయంలో అతడికి గీతా ప్రవచనం గుర్తుకు వచ్చింది.

'దుష్టుల్ని శిక్షించడానికి భక్తుల్ని రక్షించడానికి భగవంతుడు ప్రతీయాగం లోనూ అవతరిస్తాడు. ఔను జరగాలి. అంజలిలాంటివారు భగవంతుడి అవతారం ఎత్తుతారు. సంభవామి యుగే యుగే!' అనుకున్నాడు పార్థసారథి.


ఇప్పుడు పార్థసారథి మనసులో ఆనందతరంగం నాట్యం చేస్తున్నట్టుగా ఉంది. ఏదో తెలీని సంతృప్తి. ఆకాశం నిర్మలంగా ఉంది. దూరంగా తెల్లటి కొంగలు బారులుగా సాగిపోతున్నాయి. చిన్నచిన్న చినుకులు పడుతూ ఆ వాతావరణం చల్లగా, హాయిగా అనిపించింది పార్థసారథికి.

పార్థసారథి అంజలికి రెండుచేతులూ జోడించి నమస్కరించాడు. ఆమె ముఖం నిర్మలంగా, ప్రసన్నంగా కనిపించింది.

వెనక్కి తిరిగి జీపెక్కాడు. జీపు కదిలినా అంజలినే చూస్తూ ఉండిపోయాడు. 'ఆమె రూపం కళ్ళనిండా నింపుకోవాలి. ఆ రూపం దేవుడి బొమ్మలా తన గుండె గదిలో ఉండిపోవాలి' అనుకున్నాడు పార్థసారథి.

జరిగిన సంఘటనకు సాక్ష్యంగా నిలిచిన ఆ కొండ, ఇటుక బట్టీ, రావిచెట్టు, గుమికూడిన ఆ పల్లె జనం ఆశ్చర్యంలోంచి తేరుకోక మునుపే ఆ జీపు అక్కణ్ణించి కదిలిపోయింది. చూస్తుండగానే కనుమరుగయ్యింది.

★



## మధురానుభూతి

కామెడీ చిత్రాలు, సెంటిమెంట్ చిత్రాల్లోనైనా చక్కగా నటించి మెప్పించే నటుడు గోవిందా. ఈ విలక్షణ నటుడితో కలిసి నటించే ఛాన్స్ కొట్టేసింది లారాదత్తా. రవిచోప్రా కొత్త చిత్రంలో ఈ భామ నటిస్తోంది. 'బాలీవుడ్‌లోకొచ్చాక అందరితో కలిసి నటించాలని ఉంటుంది. అయితే కాలం కలిసిరావాలి కదా! గోవిందాతో నటించడం నాకెంతో హేపీగా ఉంది' అంటోంది ఎంతో వినమ్రంగా లారా. పార్టనర్ చిత్రం విజయవంతం కావడంతో ఈమె ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ముందు ముందు తన కెరీర్‌ని ఆచితూచి ఎంచుకుంటానంటోంది. కథ విన్న తర్వాత అది మంచి సినిమా అవుతుందని నమ్మకం కలిగితే అలాంటి సినిమాకు సై అంటానంటోంది.